క్లుప్తంగా

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎడవల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: నూతన సంవత్సరం సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఆదివారం పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ని ఎడవల్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి కృపాకటాక్షం ఉండాలని అయురారోగ్యాలు, ఆష్టైశ్వర్యాలు. నిండు నూరేళ్లు పిల్లాపాపలతో చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు చారి, కొండ వెంకన్నగౌడ్, రామ్‌నాయక్ పాల్గొన్నారు.

ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న అంతోటి నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): నియామకమైనప్పటి నుంచి సంస్థ అభివృద్ధికి పాటుపడుతున్న సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్‌కు ప్రభుత్వం మరో రెండేళ్లు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం కొత్తగూడెంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. సీనియర్ పాత్రికేయులు మోటమర్రి రామకృష్ణ, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. నాయకులు మాలకొండయ్య, కలవల చంద్రశేఖర్‌రావు, జిమ్మిడి మల్లేష్, పొనగంటి అంకూష్, శ్రీకాంత్, బందెల విజేందర్, మోరే రమేష్, బొట్ల స్వామి, సాయికృష్ణ, మేడి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించండి



కొత్తగా వచ్చిన సూపర్ లగ్జరీ బస్సులను పరిశీలిస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: ఆర్టీసీ సంస్థను ప్రతిఒక్కరూ ఆదరించాలని కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం డిపోలో విలేకరులతో మాట్లాడారు. మన ఊరు – మన బస్సులో భాగంగా ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. ప్రైవేట్ వాహనాల కన్నా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. ఆదాయం వచ్చే రూట్లను పరిగణలోకి తీసుకొని ఎక్కువ సర్వీసులు నడిపేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల కొత్తగూడెం డిపోకు మూడు సూపర్ లగ్జరీ బస్సులు వచ్చాయని వాటిలో రెండు సర్వీసులు తిరుపతికి నడపనున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ గీతాకృష్ణ, వైఎస్‌రావు, సర్వేష్ పాల్గొన్నారు.

నరేష్‌పై పీడీ యాక్ట్ కేసు నమోదు చెయ్యండి



ఏఎస్సై తిరుపతిరావుకు ఫిర్యాదు చేస్తున్న అయ్యప్ప మాలధారులు, భక్తులు

జూలూరుపాడు: శ్రీ అయ్యప్ప స్వామిని, హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ యాక్టు పెట్టాలని కోరుతూ అయ్యప్ప సేవా సమితి సభ్యులు, అయ్యప్ప మాలదారులు, అయ్యప్ప భక్తులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాట్లాడుతూ.. నరేష్‌ను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు రంగు నాగభూషణాచారి, యలబాక రాంబాబు, నేరేళ్లకుంట శ్రీనివాసరావు, శ్రీనాథరాజు శ్రీనివాసరాజు, అనమళ్ల భద్రయ్య, వెనిగళ్ల వెంకట సుబ్బారావు, మద్దెబోయిన నరసింహారావు, నాగుస్వామి, జూలూరుపాడు ఎంపీటీసీ సభ్యులు పెండ్యాల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్..

- శుభాకాంక్షలు చెప్పుకున్న ప్రజలు
- అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబురాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు దంపతులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 6వ వార్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాదిగ సంక్షేమ సంఘం నాయకులు కేక్ కట్ చేశారు. నాయకులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులందరూ ఈ ఏడాది నూతనోత్సాహంతో గడపాలని ఆకాంక్షించారు. కొయ్యాడ వెంకటేశ్వర్లు, సామర్ల సమ్మయ్య, బరిగెల భూపేశ్, మాటేటి గోపాల్, సావటి స్వామి, ఐ.శంకర్, కాంపెల్లి దుర్గయ్య, ఇల్లందుల పోచయ్య, మద్దికుంట గణేష్, మధు, చెరిపెల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ కార్యాలయంలో..

కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఊకంటి గోపాలరావు కేక్ కట్ చేసి, కార్మికులకు నూతన సంవ్సర శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. ఉద్యోగులు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని బలోపేతం చేయాలని, రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో 11 ఏరియాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో రీజియన్ సెక్రటరీ కూసన వీరభద్రయ్య, పిట్ కార్యదర్శులు చిలక రాజయ్య, ఎస్కే గౌస్, చెరిపెల్లి నాగరాజు, ఎండీ సత్తార్, శనిగరపు కుమార్, నటరాజ్, సుద్దాల నర్సింగం, ట్రెజరర్ గోపు కుమారస్వామి, ఈ.మోహన్‌రెడ్డి, రవీందర్, వెజ్జాల శ్రీను పాల్గొన్నారు.

ఇల్లెందు: పట్టణంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే హరిప్రియ, మార్కెట్ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్‌లకు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, సింగరేణి ఏరియా జీఎం ఎం.షాలేమురాజు, డీఎస్పీ రమణమూర్తి, సీఐ బి.రాజు, కమిషనర్ అంకుషావలీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నాయక్‌ను బీఆర్ఎస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్పీ కార్యాలయంలో...

ఇల్లెందు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రమణమూర్తికి పలువురు పట్టణ ప్రముఖులు, పోలీసులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి జీఎం ఎం. షాలేమురాజుకు పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లెందు కోర్టులో న్యాయమూర్తి ముఖేష్ జనమంచి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. న్యాయవాది దంతాల ఆనంద్ ముద్రించిన టెలిఫోన్ డైరీని ఆవిష్కరించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దొడ్డా డానియేల్, జగదాంబా సెంటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా నాయకులు చీమల వెంకటేశ్వర్లు, కొత్త బస్టాండ్ సెంటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో డాక్టర్ బి. రాంచందర్ నాయక్‌లు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

జూలూరుపాడు: మండలంలోని ప్రజలు ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి యువత నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు వీధుల్లో బాణసంచా కాలుస్తూ, నృత్యాలు చేశారు. అదేవిధంగా ఆనందోత్సవాల నడుమ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మహిళలు వాకిళ్లలో రంగురంగు ముగ్గులను తీర్చిదిద్దారు. ఆలయాలకు వెళ్లి దేవతామూర్తులకు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రైస్తవులు ఆయా గ్రామాలలో చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని బేత స్టార్ ప్రార్థనా మందిరంలో ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పాస్టర్ శరత్, విజయ్, దైవసందేశం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలోని అన్ని గ్రామల్లో ఆదివారం నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులతో 2023 సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, బేతెస్త, మారనాత తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాల్వంచ: ఆదివారం పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు వనమా ఇంటికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వనమాకు పుష్పగుచ్ఛాలు అందించారు. అదేవిధంగా పట్టణంలోని పలు చర్చిల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ఆరాధనలు చేశారు.



ఇల్లెందు: చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే హరిప్రియ, చైర్మన్ డీవీ, వైస్ చైర్మన్ జానీపాషా



ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెంలో ముగ్గుల పోటీలు



జూలూరుపాడు: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్



టేకులపల్లి: సులానగర్ ఆర్‌సీఎం చర్చిలో..



సింగరేణి(కొత్తగూడెం): టీబీజీకేఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, పులి సైదులు తదితరులు



ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో..



జూలూరుపాడు: కేరింతలు కొడుతున్న చిన్నారులు



కొత్తగూడెంరూరల్: ప్రార్థనా మందిరంలో..

సీఎండీకి శుభాకాంక్షలు



సీఎండీ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న 1535 నాయకులు

పాల్వంచ: టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘునాథరెడ్డిని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ.వజీర్ ఆధ్వర్యంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో సీఎండీలను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ డి.రాధాకృష్ణ, కుమారస్వామి, ఎస్.లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా క్వార్టర్ నాకివ్వండి..



ఎండార్స్‌మెంట్ చూపుతున్న గెర్షం దంపతులు

సింగరేణి(కొత్తగూడెం): దేవుడు వరం ఇచ్చినా.. పూజారి అడ్డుకుంటున్నట్టుగా ఉంది కార్పొరేట్ వెల్ఫేర్ విభాగంలో కొంతమంది అధికారుల పనితీరు. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని వర్క్‌షాపులో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన చింతల చెరువు గెర్షం గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ పేరుతో బర్మా క్యాంపులోని హెచ్‌డీ -146 క్వార్టర్‌లో రెంట్‌కు ఉంటున్నారు. అయితే బర్మా క్యాంపులోని శిథిలమైన క్వార్టర్లను తొలగించి వాటిస్థానంలో కొత్తక్వార్టర్లు కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఉంటున్న వారికి ఇతర ప్రాంతంలో క్వార్టర్లు కేటాయించారు. ఈ క్రమంలో చింతలచెరువు గెర్షం.. బాబూ క్యాంపులోని డిబి-16 క్వార్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే ద్వారా సింగరేణి డైరెక్టర్(పా)తో ఎలాంట్‌మెంట్ చేయించుకున్నారు. అయితే ఆ క్వార్టర్‌ను తనకు ఇవ్వడం లేదని వాపోతున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తనకు కేటాయించిన క్వార్టర్‌ను తనకు ఇవ్వాలని కోరుతున్నారు.

‘నా భద్రత– నా బాధ్యత’ పాటించండి



మాట్లాడుతున్న ఏరియా జీఎం షాలేమురాజు

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులు నా భద్రత – నా బాధ్యతను పాటించాలని తద్వారా సింగరేణిలో ప్రాణాంతక ప్రమాదాలు లేని సింగరేణిగా తీర్చిదిద్దవచ్చని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు. ఆదివారం జేకే ఓసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకే కుటుంబం, ఒకే గమ్యం అనే స్ఫూర్తితో ముందుకు సాగుతున్న సింగరేణి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాసు, ప్రాజెక్టు ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, గని మేనేజర్ పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, ఫిట్ కార్యదర్శి సంజీవరావు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు పాటించండి



మాట్లాడుతున్న ఎస్ఓటూ జీఎం మల్లయ్య

టేకులపల్లి: కార్మికులు, ఉద్యోగులు భద్రత, రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి ఇల్లెందు ఏరియా ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య అన్నారు. ఆదివారం కేటీసీలో నా భద్రత – నా బాధ్యత అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం అనే స్ఫూర్తితో ఎస్ఎంపీని అమలు చేస్తూ 2023 సంవత్సరాన్ని ప్రమాదములు లేని సింగరేణిగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు నింపాలని కోరుతూ అధికారులు, ఉద్యోగులు, ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్‌వీఆర్ ప్రహ్లాద్, గని మేనేజర్ సౌరభ్ సుమన్, సేఫ్టీ ఆఫీసర్ కేఎస్ఎన్ రాజు, సీనియర్ పర్సనల్ అధికారి పి.కృష్ణ, పిట్ సెక్రటరి అశోక్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యమత్యాన్ని పెంచుతాయి

ఇల్లెందురూరల్: క్రీడలు యువతలో ఐక్యమత్యం పెంచుతాయని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. బొజ్జాయిగూడెం గ్రామంలో యంగ్‌తరంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడగా వాలీబాల్‌ను ఏజెన్సీ ప్రాంత యువత ఆదరించడం అభినందనీయమన్నారు. వరుసగా ప్రతి ఏటా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 17వ సారి పోటీలు నిర్వహించడం యువత ఐక్యమత్యానికి నిదర్శనం అన్నారు. యువతను సన్మార్గంలో నడిపేది క్రీడలేనని పేర్కొన్నారు. సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మెట్టెల శిరోమణి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ తరగతుల ముగింపు



మహిళలతో సేవా సమితి అధ్యక్షురాలు మధురవాణి

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ రకాల ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం సేవా కార్యాలయంలో నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షులు జి.మధురవాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సుమారు 100 మంది మహిళలు వివిధ రకాల ఉపాధి రంగాలలో నిర్దీత కాలం పాటు అనువజ్ఞులైన శిక్షకుల పర్యవేక్షణలో శిక్షణ పొందారని, వారికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శిక్షణల ద్వారా ఎంచుకున్న మార్గాలలో పయనించి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవా కార్యదర్శి విజయ సుందర్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ‘డయల్ యువర్ డీఎం’

చుంచుపల్లి: ఆర్టీసీ ప్రయాణికుల నుంచి సూచనల కోసం జనవరి 2న ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ బి.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం డిపో పరిధిలోని ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను తెలపాలని సూచించారు.

రామాలయం ముస్తాబు

టేకులపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారి ఉత్తరద్వార దర్శనం కోసం ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం తెల్లవారు జామున ఉదయం 4 గంటలకు భక్తులు ముక్కోటి ఉత్తరద్వార దర్శనానికి తరలిరావాలని ఆలయ పూజారి, నిర్వాహకులు తెలిపారు.

దుస్తులు పంపిణీ



కేక్ కట్ చేస్తున్న చంద్రగిరి

కొత్తగూడెంరూరల్: నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ జీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గడల శ్రీనివాసరావు పిలుపు మేరకు స్థానిక శ్రీనగర్ కాలనీ 3వ లైన్‌లో ఆదివారం పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజర్ చంద్రగిరి కేక్ కట్ చేసి క్యాలెండర్లు ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోఆర్డినేటర్ మోదుగు జోగారావు, సభ్యులు బోడ హరి, జగడం కిరణ్, గడల నర్సింహారావు, భరత్, హర్షిత్, జీవీఆర్ ప్రసాద్, శంకర్, వినోద్, గోపిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

టేకులపల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పాతర్లగడ్డ గ్రామానికి చెందిన తాటి కిరణ్ (21) డిసెంబర్ 29న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పూర్తి వివరాలు బోడు పోలీసుల నుంచి తెలియాల్సి ఉంది.

బస్సుల్లేక ముక్కోటి భక్తుల ఇక్కట్లు



కొత్తగూడెం బస్టాండ్‌లో భద్రాచలం వెళ్లేందుకు నిరీక్షిస్తున్న భక్తులు, ప్రయాణికులు

చుంచుపల్లి: ముక్కోటి సందర్భంగా భద్రాచలం వెళ్లే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పిన ఆర్టీసీ అధికారుల తీరు ప్రకటనలకే పరిమితమైంది. ఆదివారం భద్రాచలం వెళ్లే భక్తులకు బస్సులు అందుబాటులేక గంటల కొద్దీ కొత్తగూడెం బస్టాండ్‌లో నిరీక్షించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వెళ్తున్న భక్తులు మధ్యాహ్నం 2 గంటల తరువాత బస్సు సర్వీసులు లేకపోవడంతో ఆటోలు, ప్రైవైట్ వాహనాలను ఆశ్రయించారు. సమాచారం తెలుసుకున్న కొత్తగూడెం ఆర్టీసీ అధికారులు అప్పటికప్పుడు బస్సులను ఏర్పాటు చేసి పరిస్థితిని చక్కదిద్దారు. సోమవారం వైకుంఠ ద్వారదర్శనం నేపథ్యంలో భక్తులు పెరిగే అవకాశం ఉన్నందున తగిన బస్సులు అందుబాటులో ఉంచాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

కార్మికులకు గుర్తింపు సంఘాల వెన్నుపోటు



మాట్లాడుతున్న ప్రసాద్

టేకులపల్లి: 11వ వేజ్ బోర్డు చర్చల్లో కాంట్రాక్టు కార్మికులకు ప్రత్యేక ఒప్పందం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాకుల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయూ–ఇఫ్టూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా టేకులపల్లిలోని సింగరేణి హైటెక్ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3న కలకత్తాలో 11వ వేతన ఒప్పందం చర్చలు జరగనున్నాయని చెప్పారు. ఈ చర్చల్లో సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 2013 నుంచి హెచ్‌పీసీ వేతనాలు ఒప్పందం చేసుకుని అమలు చేయకుండా మొండికేస్తున్న యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని జేబీసీసీఐ సంఘాలను కోరారు. మొదటి కేటగిరి వేతనం లేదా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు కొరకు సమావేశంలో చర్చించాలని, అవసరమైతే పర్మనెంట్ కార్మికుల వేతన ఒప్పందం మీద సంతకం చేయకుండా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు 30 శాతం జీతాలు పెంచారు కానీ సింగరేణి అధికారులు జీఓ నంబర్ 60ని అమలు చేయడానికి సమయం కావాలని మోసం చేశారని ఆరోపించారు. సమ్మె చేయించిన సంఘాలు వెన్నుపోటు పొడిచాయని, దీనివల్ల కాంట్రాక్టు కార్మికులకు వంచనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షఫీ, కౌసల్య, జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.

ఒకే భవనం.. రెండు ప్రభుత్వ కార్యాలయాలు



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, ఆయా..



గ్రామపంచాయతీ విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి, సిబ్బంది

టేకులపల్లి: వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తమ విధులు నిర్వహించేందుకు ఆయా శాఖలకు ప్రత్యేకంగా కార్యాలయ భవనాలు ఉండటం సాధారణమే. కానీ మండలంలోని పెట్రాంచెలక గ్రామంలో కొన్నేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రంలోనే గ్రామ పంచాయతీ కార్యకలాపాలు కూడా కొనసాగిస్తున్నారు.

పెట్రాంచెలక కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడిన తరువాత భవనం లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కనీస సౌకర్యాలు లేక, పూర్తిస్థాయిలో నిర్వహణ చేయలేక పంచాయతీ అధికారులు, సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వం పంచాయతీ భవనాలు ఉన్న గ్రామాలకే నూతన భవనాలు మంజూరు చేయడం విశేషం. ప్రభుత్వం స్పందించి కొత్తగా ఏర్పడిన అన్ని గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.